epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

తెలంగాణ చౌరస్తా
వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:347

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 20.07.2025 సోమవారం, హైదరాబాద్

## నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



- ఆగస్టు 13 వరకు కొనసాగింపు
- 8 బిల్లులతో కేంద్రం రెడీ
- నీట్, అయోధ్య అంశాలపై పోరుకు విపక్షాలు సై

2లో

## కల్తీ ఆహారంపై ఉక్కుపాదం



- కల్తీ రాయుళ్లపై హెచ్-ఫాస్ట్ యాక్షన్ షురూ
- ఆహార కల్తీకి పాల్పడిన ఆరుగురు అరెస్టు
- ఆహార తయారీ, విక్రయకేంద్రాల్లో హెచ్-ఫాస్ట్ సిబ్బంది తనిఖీలు
- వాడిన నూనెలే పదేపదే వినియోగిస్తూ
- ప్రమాదకర రంగులు కలుపుతున్నట్లు తనిఖీల్లో తేలింది
- ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లేకుండానే వ్యాపారాలు
- కల్తీ ఆహారంపై 87126 61212కు ఫిర్యాదు చేయండి
- ప్రజలకు అధికారుల పిలుపు

> కొంతమంది అక్రమార్కులు ఆహార పదార్థాలను విచ్చలవిడిగా కల్తీ చేస్తూ సమాజంపై నిశ్శబ్ద దాడికి దిగుతున్నారు. రసాయనాలు, నాణ్యత లేని కల్తీ ఆహారపదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కల్తీ రాయుళ్లపై హెచ్‌ఫాస్ట్ కొరడా ఝులిపించింది.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఈ మేరకు నగరంలోని బహదూర్పురా, కిషన్బాగ్, సికింద్రాబాద్, మల్కాజ్గిరి, బేగంబజార్లో హెచ్‌ఫాస్ట్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆహార కల్తీకి పాల్పడుతున్న ఆరుగురు వ్యాపారులను అరెస్టు చేశారు. అధికారుల తనిఖీలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహారపదార్థాలు తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. వాడిన నూనెను పదేపదే వాడుతూ, ప్రమాదకర రంగులు కలుపుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఆహారం తయారీలో గడువు తీరిన పదార్థాలను నిర్వాహకులు వాడుతున్నట్లుగా గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లేకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. కల్తీ ఆహారంపై టోల్ఫ్రీ నంబర్ 87126 61212కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

ఆహార, ఔషధాల కల్తీ నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని శనివారం జరిగిన సమావేశంలో అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు తదితర ఆహార పదార్థాలు కల్తీమయం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై ఎంసీహెచ్ఆర్డీలో రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లను త్వరగా మగ్గించేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడం వల్ల ప్రజలు

మిగతా 2 లో

## సర్‌పై ప్రత్యేక దృష్టి
# సారించండి



### ఎన్నికల ప్రచారాన్ని తలపించాలి
### ఓటర్ జాబితాలో పేర్లను నమోదు చేయించాలి

- నేడు ఇన్‌చార్జ్ మంత్రులు జిల్లాల్లో సర్‌పై సమీక్ష
- పదవులు, పోస్టుల కోసం ప్రదక్షిణలు వద్దు
- ఆగస్టు 3 దాకా ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దు
- సర్‌పై జూమ్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- సర్‌పై నిర్లక్ష్యాన్ని సహించబోం
- అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడండి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్

> సర్‌పై ఆగస్టు మూడో తేదీ వరకు యుద్ధం చేయాలని, నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని తలపించాలని, ఓటర్ జాబితాలో పేర్లను నమోదు చేయించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నాయకులు అందరూ ఈ 15 రోజులూ సర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, క్షేత్రస్థాయి లో తిరగాలన్నారు. సోమవారం ఇన్‌చార్జ్ మంత్రులు జిల్లాల్లో సర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని సీఎం తెలిపారు.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఇన్‌చార్జ్‌లైన ఎంపీలు పనిచేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని ప్రదక్షిణలు చేయొద్దని, గాంధీభవన్ చుట్టూ ఎవరూ తిరగొద్దని, అలాంటి వారి కి అపాయింట్‌మెంట్లు కూడా ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులు గాంధీభవన్‌కు ఎవ్వరు కూడా రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చుంటున్నారని, గ్రామాల్లోకి వెళ్లి పనిచేయడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

సర్(ఎస్ఐఆర్) పైన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జూమ్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం సర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిందని, దీనిని ఒక అవకాశంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ

మిగతా 2 లో




# నీళ్లెత్తి పోయండి



- కేసీఆర్‌ను తిట్టిపోయటం కాదు
- గోదావరి జలాలను ఎత్తిపోస్తేనే పొలాలు తడుస్తాయి
- కరువుకు నీళ్లే పరిష్కారం.. విమర్శలు కాదు
- చిన్నకోడూరు రైతుల మహా పాదయాత్రకు సంఘీభావం
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో నీటి కరువు
- ఎరువుల కొరత, సంక్షేమ పథకాల అమలులో లోపాలు
- అభివృద్ధి పనుల్లో జాప్యం...రైతుల కోసం దేనికైనా సిద్ధం
- మాజీమంత్రి హరీశ్ రావు

2లో



# 40 టీఎంసీలే దిక్కు

- కృష్ణా, గోదావరి బేసిన్లలో ప్రాజెక్టులు వెలవెల
- డెడ్ స్టోరేజీ పోను మిగిలింది కొద్దిపాటి జలాలే..
- తెలంగాణను వెంటాడుతున్న నీటి సంక్షోభం
- 28 జిల్లాల్లో తీవ్ర వర్షా భావం
- 30శాతం లోటు వర్షపాతం
- వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- రాబోయే మూడునెలలు మరింత ప్రమాదకరం
- తాగు, సాగు నీటిరంగం, పరిశ్రమలు, సింగరేణి, విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో నీటి సంక్షోభం తీవ్రమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎల్ నినో కంటింజెన్సీ ప్రణాళిక గణాంకాలు తాజా పరిస్థితులను స్పష్టం చేస్తున్నాయి. కృష్ణా, గోదావరి బేసిన్‌లలోని అన్ని ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టుల్లో డెడ్ స్టోరేజీని మినహాయిస్తే వినియోగానికి కేవలం 40 టీఎంసీల నీరు మాత్రమే మిగిలింది. ఇదే నీటితో తాగు, సాగుకు, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, సింగరేణి అవసరాలను తీర్చాల్సి ఉంటుంది.

సాధారణంగా జూలై మధ్య నాటికి రిజర్వాయర్లు వరద నీటితో నిండాలి. కానీ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో ఆశించిన వర్షాలు కురవ లేదు. ఇప్పటికే చాలా జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. రాబోయే మూడు నెలల వరకూ ఇదే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టుల్లోకి వరద చేరే అవకాశం లేకపోవడం, భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నీటి నిర్వహణ, తాగునీటి భద్రత, వ్యవసాయ రక్షణ ప్రభుత్వానికి అత్యంత కీలక సవాళ్లుగా మారాయి.

**అత్యంత క్లిష్ట పరిస్థితులు**

ఎల్ నినో పరిస్థితుల కారణంగా కృష్ణా బేసిన్‌లో అత్యంత క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లోని ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టుల్లో వినియోగానికి కేవలం 12.88 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. అందు లో నాగార్జునసాగర్‌లో 6.01 టీఎంసీలు, మిగతా మధ్యతరహా ప్రాజెక్టుల్లో కలిపి 5.88 టీఎంసీల

మిగతా 2 లో

## గాజాకు మద్దతుగా లండన్‌లో భారీ ర్యాలీ


- కొత్త ప్రధాని చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఇజ్రాయిల్‌పై ఆయుధనిషేధం విధించాలి
- నెతన్యాహు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి : ఆండీ
- బర్న్‌హామ్‌కు ప్రదర్శనకారుల డిమాండ్




**తెలంగాణ చౌరస్తా వెబ్ డెస్క్:**

గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హనన యుద్ధానికి నిరసనగా బ్రిటిష్ రాజధాని లండన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. కాబోయే యూకే ప్రధాని తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. అక్టోబర్ 2023 నుంచి 73,000 మందికి పైగా పాలస్తీనియన్లను బలిగొన్న ఈ ప్రాంతంపై ముట్టడి, యుద్ధాన్ని ముగించేలా టెల్ అవీవ్‌పై ఒత్తిడి

మిగతా 2 లో



### రెండో విడతలో అదనంగా
## 4,347 బీటెక్ సీట్లు

- మొత్తం 54 కళాశాలల్లో కొత్తగా పెరిగిన 6,210 సీట్లు
- రెండో విడత కౌన్సెలింగ్ కు మొత్తం 31,834 సీట్లు
- కొత్తగా వచ్చిన సీట్లకు 10 శాతం
- ఈడబ్ల్యూఎస్ కోటా అదనంగా కేటాయింపు

2లో

# నీళ్లెత్తి పోయండి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

కేసీఆర్‌ను తిట్టిపోస్తే నీళ్లు రావని, గోదావరి జలాలను ఎత్తిపోస్తేనే రైతుల పొలా లు తడుస్తాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లాలోని రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ చిన్నకోదూరు మండల రైతులు ఆదివారం నిర్వహించిన మహా పాదయాత్రకు ఆయన సంఘీభావం తెలిపారు.15 కిలో మీటర్ల మేర సాగిన పాదయాత్రలో వేలాది మంది రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మహా పాదయాత్ర బీఆర్ఎస్ కార్యక్రమం కాదని.. రంగనాయకసాగర్, అనంతగిరి రిజర్వాయర్ల ఆయకట్టు రైతులే స్వచ్ఛందంగా నిర్వహించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నీటి కరువు, ఎరువుల కొరత, సంక్షేమ పథకాల అమలులో లోపాలు, అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి రంగనాయకసాగర్ సహా రిజర్వాయర్లను నింపడంతో రైతులకు రెండు పంటలకు నీరు అందిందన్నారు. రైతులు ఫోన్ చేస్తే కాలువ గేట్లు తెరిచి సాగునీరు విడుదల చేసిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు.ప్రస్తుతం కాళేశ్వరం పంపులను ప్రారంభించకుండా గోదావరి జలాలను దిగువకు వదిలేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు మేలు జరగాలంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ విమర్శలను పక్కనపెట్టి సాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని కోరారు.రైతుల కోసం తాను ఎలాంటి త్యాగానికైనా సిద్ధమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే మోటార్లు ప్రారంభించి నీటిని ఎత్తిపోయకపోతే రైతుల ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని హెచ్చరించారు. చిన్నకోదూరు పాదయాత్రతో ప్రారంభమైన ఈ ఉద్యమం ఇంతటితో ఆగదని, ఇతర మండలాలకు కూడా వ్యాప్తి చెందుతుందన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా అమలు హామీలను ప్రభుత్వం పూర్తిగా నెరవేర్చలేదన్నారు.ఎరువుల కొరత, విద్యుత్ అంతరాయాలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. యూరియా యాప్‌లు ప్రవేశపెట్టడం కంటే రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచి తే రైతులకు సౌకర్యంగా ఉంటుందని హరీశ్‌రావు సూచించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలకు తావివ్వకుండా, శాస్త్రీయంగా అందుబాటులో ఉన్న గోదావరి జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కరవు నుంచి రైతులను కాపాడాలనే లక్ష్యంతోనే ఈ పోరాటం మొదలైందని స్పష్టం చేశారు.

# గాజాకు మద్దతుగా లండన్‌లో భారీ ర్యాలీ

**తరువాయి భాగం**

తేవాలని, ఇజ్రాయిల్‌పై ఆయుధాల నిషేధం విధించాలని కోరుతూ లండన్‌లోని ప్రదర్శనకారులు రోడ్డెక్కారు. "మూడేండ్లు గా కొనసాగుతున్న జాతి హననం, బ్రిటన్‌లో ప్రపంచవ్యాప్తంగా న్యాయం, జవాబుదారీతనం కోసం బ్రిటన్ లో జరుగుతున్న ఉద్యమం మరింత బలంగా మారుతోంది," అని యూకేలోని పాలస్తీనా రాయబారి హుసామ్ జోమ్లోట్ ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. లండన్‌లో వేలాది మంది పాలస్తీనా కోసం నిరసన తెలుపుతున్నారని, పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని అంతం చేయడానికి, ఆ దేశంపై పూర్తిస్థాయి ఆయుధ నిషేధాన్ని విధించడంతో సహా, కొత్త ప్రధాని తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేస్తున్నట్టు పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ పేర్కొంది. పదవీ విరమణ చేస్తున్న ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ హయాంలో జరిగిన మారణహోమాన్ని ఎదుర్కోవడంలో బర్న్‌హామ్ లేబర్ పార్టీ వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడిందనడానికి ఆధారాలు పెరుగుతున్నప్పటికీ, ఆయన ప్రభుత్వం ఆ దేశానికి ఆయుధాలను సరఫరా చేస్తూనే ఉంది.

అతివాద మంత్రులైన ఇటామర్ బెన్‌గ్విర్, బెజాలెల్ స్మోట్రిచ్‌లపై ఆంక్షలు విధించడం వంటి నామమాత్రపు చర్యలను మాత్రమే స్టార్మర్, అతని మంత్రి వర్గం ఇజ్రాయిల్‌పై తీసుకున్నారని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ప్రధాన మంత్రిగా బర్న్‌హామ్ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాటిలో జీవన వ్యయ సంక్షోభం, విపరీతంగా పెరుగుతున్న విద్యార్థి రుణాలు, సరసమైన గృహాల కొరత, గాజా విషయంలో లేబర్ పార్టీ ఉదాసీనమైన స్పందన కారణంగా సభ్యులు పార్టీని వీడి వెళ్ళిపోవడం వంటివి ఉన్నాయి. జోమ్లోట్ నాయకత్వంలో నిరసనకారులు లండన్ గుండా కవాతు చేస్తూ, పాలస్తీనాకు మద్దతుగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. పార్టీ నుంచి స్టార్మర్ బహిష్కరించబడిన మాజీ లేబర్ నాయకుడు జెరెమీ కార్బిన్ కూడా ఈ కవాతులో పాల్గొన్నారు. జాతి నిర్మూలనలో యూకే భాగస్వామ్యాన్ని అంతం చేయాలని కార్బిన్ బర్న్‌హామ్‌ను కోరారు. లేబర్ పార్టీ నాయకుడు బర్న్‌హామ్ సోమవారం అధికారికంగా యూకే తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. "కొత్త ప్రధాన మంత్రికి ఒక సందేశాన్ని వినిపించడానికి భారీ సంఖ్యలో లండన్‌లో ఉన్నాం. మేము కనుమరుగవ్వం. ఎక్కడికీ వెళ్ళిపోం, అలాగే పాలస్తీనా విముక్తి కోసం సాగిస్తున్న పోరాటానికి అండగా ఉంటామ" ని ప్రదర్శనకారులు స్పష్టం చేశారు.

# రెండో విడతలో అదనంగా 4,347 బీటెక్ సీట్లు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో;**

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ రెండో విడతలో మరో 4,347 బీటెక్ సీట్లు కలిశాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంతో వాటిని కౌన్సెలింగ్లో చేర్చారు. కన్వీనర్, యాజమాన్య కోటా కలిపితే 6,210 సీట్లు కొత్తగా పెరిగాయి. వాటిలో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. మొత్తం 54 కళాశాలల్లో కొత్తగా సీట్లు పెరిగాయి. మరో రెండు కళాశాలలకు సర్కారు అనుమతిచ్చింది. కూకట్పల్లి విలేజ్లో ఓ కళాశాల ప్రారంభమైంది. చేవెళ్లలో గతంలో ఉన్న కళాశాల మూతపడగా దానికి మళ్లీ తరగతుల నిర్వహణకు అనుమతి ఇచ్చింది. ఈ రెండింట్లో 240 సీట్లు చొప్పున అందుబాటులోకి వచ్చాయి.తొలివిడత కౌన్సెలింగ్ తర్వాత మిగిలినవి 27,487 సీట్లుండగా రెండో విడత కౌన్సెలింగ్కు మొత్తం 31,834 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 17న రెండో విడత మొదలవ్వగా కొత్తగా 2,622 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. శనివారం ఉదయం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలవ్వగా తొలిరోజే 27,197 మంది ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వెబ్ ఆప్షన్లు గడువు ఇవాళ అర్ధరాత్రి 12 గంటలకు ముగియనుంది. కొత్తగా వచ్చిన సీట్లకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అదనంగా కేటాయించారు. అంటే మరో 430 సీట్లు పెరగనున్నాయి.కొత్తగా వచ్చిన 4,347 సీట్లు 17 రకాల బ్రాంచీలకు సంబంధించినవని ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. వాటిల్లో అత్యధికంగా సీఎస్ఈలో 1,008, ఈసీఈలో 819, సీఎస్ఈలో 672, సీఎస్ఈ (డేటా సైన్స్)లో 378 కొత్తగా చేరాయి. ఇతర కోర్సుల వారీగా సీట్లు ఏఐ అండ్ డేటా సైన్స్(63), ఏఐ అండ్ ఎంఎల్(84), సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ (126), కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ(126), సీఎస్ఈ ఐఓటీ (42), ఐటీ (84), బయోటెక్నాలజీ(84), సివిల్ (189), ఈసీఈవీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ(42), ఈఈఈ(168), ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ(231), మెకానికల్(147), ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ 84 సీట్లు కొత్తగా కౌన్సెలింగ్లో చేరాయి.రాష్ట్రంలో బీటెక్ కొత్త సీట్లపై అటు విద్యార్థులు ఇటు కళాశాల యాజమాన్యాల్లో ఉత్కంఠ నెలకొనగా మరోవైపు విద్యాశాఖ అధికారులు నేరుగా ఎప్సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ వెబ్సైట్లో పెట్టనున్నారు. మరోవైపు విద్యాశాఖ అధికారులు నేరుగా ఎప్సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ వెబ్సైట్లో పెట్టనున్నారు. ప్రతి ఏడాదిలో అదనపు సీట్లను చివరి నిమిషంలో ఖరారు చేస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అయోమయంలో పడుతున్నారు. కొత్తగా సీట్లకు అనుమతి ఇస్తున్న విద్యాశాఖ ఏ కళాశాలలలో ఏ కోర్సు అదనంగా వచ్చింది? ఏ బ్రాంచిలో సీట్లు పెరిగాయన్న వివరాలు ఇవ్వకుండా ఇప్పటికే ఉన్న సీట్లకు కలిపి కౌన్సెలింగ్లో చేరుస్తున్నారు. దానివల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు.నిబంధనల ప్రకారం కొత్త సీట్లు మంజూరు చేస్తే ప్రభుత్వం కళాశాలలవారీగా సీట్లు పేర్కొంటూ జీవో జారీ చేయాలి. ఆ తర్వాత వర్సిటీలు నిర్వహించి ఆమోదించిన తర్వాతే కౌన్సెలింగ్లో చేర్చాలి. దానికి భిన్నంగా ముందు కౌన్సెలింగ్లోకి చేర్చి తర్వాత అంతర్గత ఉత్తర్వులు ఇస్తున్నారన్న విమర్శలు 23 ఏళ్ల నుంచి ఉన్నాయి. మరోవైపు అదనపు సీట్లు ఇవ్వాలంటే కళాశాలలను తనిఖీ చేయాల్సి ఉండటంతో విద్యాశాఖ ఆదేశాలతో జేఎన్టీయూహెచ్, ఓయూలు శుక్రవారం తనిఖీలు నిర్వహించాయి. ఓయూలో 6 కళాశాలలకు మూడు బృందాలను పంపినట్లు సమాచారం. జేఎన్టీయూ హెచ్లో పదుల సంఖ్యలో కళాశాలలున్నాయి.

# కల్తీ ఆహారంపై ఉక్కుపాదం

**తరువాయి భాగం**

అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు.ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం కారణంగా పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకునేందుకు విదేశాలు నిరాకరిస్తున్నాయని వివరించారు. మార్కెట్లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో అధిక ధరలకు అమ్ముతున్నారని, అయితే అవి ఆర్గానిక్ ఉత్పత్తులేనని నిర్ధారించేందుకు సరైన వ్యవస్థలు లేవని అధికారులతో సమీక్ష సందర్భంగా రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారుల సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లుగా ఆయన తెలిపారు.

# నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో**

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం 8 బిల్లులను సిద్ధం చేసింది. ముఖ్యంగా సోమవారమే పార్లమెంట్ ముందుకు రెండు కీలక బిల్లులు రానున్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37 కు పెంచుతూ రూపొందించిన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది.

వందేమాతరం గేయానికి జాతీయగీతం హోదా కల్పిస్తూ రూపొందించిన బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశ పెట్టనున్నారు. ఈ క్రమంలోనే సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేంద్రం కోరింది. మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీకేజీ సహా పలు కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని విపక్షాలు ప్రకటించాయి. ఈ మేరకు కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష భేటీలో తమ వైఖరిని స్పష్టం చేశాయి. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడీవేడీగా సాగనున్నాయి.

# 40 టీఎంసీలే దిక్కు

**తరువాయి భాగం**

నీరుంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, అందులో అధిక భాగం డెడ్ స్టోరేజీ కింద పరిగణిస్తారు. మిగిలిన కొద్దిపాటి జలాలనే హైదరాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలు, అలాగే నాగార్జునసాగర్ ఎడమ, కుడి కాలువల కింద లక్షలాది ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. వర్షాలు ఆశించిన మేర కురవకపోతే తాగునీటికి ప్రాధాన్యం ఇస్తూ సాగునీటి విడుదలను ప్రభుత్వం పరిమితం చేసే అవకాశం ఉంది.ఇక కృష్ణా నదిపై ఉన్న ఎగువ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, తెలంగాణకు అదనపు వరద జలాలు వచ్చే అవకాశాలు తగ్గి పోయాయి. కృష్ణా బేసిన్‌తో పోలిస్తే గోదావరి బేసిన్‌లో నీటి నిల్వలు కొంత మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం ఆందోళనకరంగానే ఉంది. గోదావరి బేసిన్‌లోని 7 ప్రధాన, 28 మధ్య తరహా రిజర్వా యర్లలో 66.50 టీఎంసీల నీరు ఉంది. అందులో 37.21 టీఎంసీలు డెడ్ స్టోరేజీ కింద ఉండటంతో, వినియోగానికి 29.30 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. ఉత్తర తెలంగాణకు కీలకమైన ప్రాజెక్టులన్నీ కనిష్ఠ స్థాయి నిల్వలతోనే కొనసాగుతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 4.54 టీఎంసీలు, సింగూరులో 3.66 టీఎంసీలు, లోయర్ మానేరులో 3.60 టీఎంసీలు, మిడ్ మానేరులో 1.17 టీఎంసీలు, నిజాంసాగర్‌లో 0.63 టీఎంసీలు, శ్రీరాంసాగర్‌లో కేవలం 0.28 టీఎంసీలు, కడెం ప్రాజెక్టులో 0.22 టీఎంసీల చొప్పున వినియోగానికి మిగిలాయి.గోదావరి బేసిన్‌పై ఆధారపడిన ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజ న్న సిరిసిల్ల, కామారెడ్డి తదితర జిల్లాల్లో సాగునీటి అవసరాలు, తాగునీటి సరఫరా, పరిశ్రమల నీటి అవసరాలు ఈ నిల్వలపైనే ఆధారపడి ఉన్నాయి. ముఖ్యంగా శ్రీరాంసాగర్, నిజాంసాగర్ వంటి ప్రాజెక్టుల్లో విని యోగానికి మిగిలిన నీరు ఒక టీఎంసీకి కూ డా చేరలేదు.

**ఐదు జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం**

జూన్ 1 నుంచి జూలై 14 వరకు రాష్ట్రంలో 228 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 158 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 30 శాతం వర్షలోటు నమోదైంది. మొత్తం 28 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా, కేవలం 5 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షాలు కురిశాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం పరిస్థితి ఇక్కడి తో ఆగేలా కనిపించడం లేదు. ఆగస్టులో 15 శాతం, సెప్టెంబరులో 42 శాతం, అక్టోబరులో 55 శాతం వరకు వర్షపాతం లోటు నమోదయ్యే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది .ఈ అంచనాలు నిజమైతే వానాకాలం పంటల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు యాసంగికి అవసరమైన నీటి నిల్వలు మరింత తగ్గిపోతాయి. తక్కువ వర్షపాతం కారణంగా రిజర్వాయర్లలోకి కొత్తగా నీటి ప్రవాహాలు ఉండక పోవచ్చు. ఫలితంగా ప్రస్తుతం ఉన్న నిల్వలనే మరింత జాగ్రత్తగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదే సమయంలో రైతులు బోర్లపై ఆధారపడాల్సి రావడంతో భూగ ర్భ జలాలపై ఒత్తిడి పెరిగి, అవి మరింత వేగంగా దిగజారే ప్రమాదం ఉంది.లోతుల్లోకి భూగర్భ జలాలుప్రభుత్వ అంచనాల ప్రకారం జూన్‌లో సగటు భూగర్భ జలమట్టం 9.46 మీటర్లు ఉండగా, జూలైలో అది 10.35 మీటర్లకు పడిపోయింది. ఆగస్టు నాటికి 11.01 మీటర్ల లోతుకు చేరే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అంటే కేవలం రెండు నెలల్లోనే భూగర్భ జలాలు దాదాపు 1.5 మీటర్లకు పైగా దిగజారే ప్రమాదం ఉంది. భూగర్భ జలమట్టం పడిపోతే బోర్లు ఎండిపోయే ప్రమాదం పెరుగుతుంది.కొత్తగా బోర్లు వేసినా నీరు దొరకకపోవడం, మోటార్ల విద్యుత్ వినియోగం పెరగడం, సాగు ఖర్చులు అధికమవడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అంతేకాదు, బోర్‌వెల్స్ కూడా సంక్షోభం ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా ట్యాంకర్లపై ఆధారపడే గ్రామాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో కూడా భూగర్భ జలాలపై ఆధారపడే కాలనీలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చు.

# సర్‌పై ప్రత్యేక దృష్టి సారించండి

**తరువాయి భాగం**

ఆధ్వర్యంలో సర్‌పై 489 సమావేశాలు జరిగాయని తెలిపారు. బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా స్పందించి సమావేశాలు నిర్వహించాలని సీఎం సూచించారు. సోమవారం పది మంది ఇన్‌చార్జ్ మంత్రులు అన్ని జిల్లాల్లో సర్‌పైన సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని, ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలన్నారు. ఇన్చార్జీలుగా వ్యవహరిస్తున్న చోట ఎంపీలు పని చేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామని సీఎం సున్నితంగా హెచ్చరించారు. పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌చార్జులుగా ఉన్న వారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, చైర్మన్లు బీఎల్ఓల రిపోర్టుల కంటే బీఎల్ఏల రిపోర్టులను పరిశీలించాలని సూచించారు. బీఎల్ఓల రిపోర్టుల మీద మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయని సీఎం హెచ్చరించారు. పార్టీ పరంగా పనిచేస్తున్న బీఎల్ఏలను నాయకులు సమర్థవంతంగా ఉపయోగించాలన్నారు. నాయకులు పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలి.సర్ ప్రక్రియ చాలా కీలకమైనదని, ఎవ్వరు కూడా నిర్లక్ష్యం చేయవద్దని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నాయకులందరూ వారి నియోజకవర్గాల్లో సర్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆగస్టు 3వ తేదీ వరకు సర్ ప్రక్రియపైనే ఉండాలన్నారు. చిన్న నిర్లక్షాన్ని కూడా సహించేది లేదని, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు సర్ పనులను వేగవంతం చేసి బీఎల్ఏలకు సహకారం అందించాలని మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు.దేశంలో సర్ వల్ల జరిగిన నష్టాలను గుర్తించి ఇక్కడ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో మనం ఎంత కష్టపడుతామో అలాగే ఇప్పుడు ఈ పనులను చేయాలన్నారు. సర్ పనులు పూర్తయ్యే వరకు నియోజకవర్గాల్లో ఉండి.. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడాలన్నారు.



**హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు..**

హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదని, వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎస్ఐఆర్‌కు నియమించిన పార్టీ ఇనాచార్జ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని స్పష్టం చేశారు. బీఎల్ఏ, బీఎల్ఓ రిపోర్టులను గాంధీభవన్ టీం ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అంతే కాకుండా సర్‌ను ఇన్‌చార్జ మంత్రులు పూర్తి పర్యవేక్షణ చేయాల్సిందేనని, అన్నింటికీ వారిదే బాధ్యత అన్నారు. ఈనెల 30న మళ్లీ పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తామని, అసెంబ్లీల వారీగా నివేదికలు తీసుకుంటామని సీఎం తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఇన్చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లను సమన్వయం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సర్‌పై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు.బాగా పనిచేసే 100 మంది బీఎల్ఏలకు రాహుల్‌గాంధీని కలిసి ఫొటో దిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, సర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# ఫోక్ సాంగ్స్ లో... బండి ఫోక్ సాంగ్స్ వేరయా..

- సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా జానపద గీతాలు
- బండి ఫోక్స్ పేరుతో యువతను ఆకట్టుకుంటున్న జానపద గీతాలు
- సోషల్ మీడియాలో దూసుకెళ్తున్న "గురిగింజ చీరకట్టి" సాంగ్
- బోనాల జోష్‌కు ఫోక్ సాంగ్స్ ఊపు




**తెలంగాణ చౌరస్తా హైదరాబాద్ బ్యూరో:**

ఒకప్పుడు గ్రామీణ సంస్కృతికి మాత్రమే పరిమితమైన ఫోక్ సాంగ్స్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్నాయి.జానపద గేయాలు మన సంస్కృతి,జీవన విధానం, సంప్రదాయాలను ప్రతిబింబించే పాటలు.ఇవి శతాబ్దాలుగా మౌఖికంగా ఒక తరం నుండి మరొక తరానికి అందించబడుతున్నాయి.వీటిలో శ్రామిక పాటలు,పండుగ పాటలు,కథా గేయాలు, ఆధ్యాత్మిక పాటలు అనేకం ఉన్నాయి.సోషల్ మీడియా, యూట్యూబ్,ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వంటి వేదికల ద్వారా తెలంగాణ జానపద గీతాలు కోట్లాది మంది ప్రేక్షకులను అలరిస్తున్నాయి.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జానపద గీతాలు ప్రేరణగా పనిచేశాయి.నేటి టీవీ షోల్లో, సినిమాలలో కూడా జానపద గీతాలను ఆధునికంగా రూపొందిస్తున్నారు.పల్లె పాటల పోటీలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో ఈ పాటలకు ప్రాధాన్యత ఉంది.

**యువత చూపు... ఫోక్ సాంగ్స్ వైపు..**

పల్లె జీవనం,సంప్రదాయాలు,ప్రకృతి అందాలు, మానవ సంబంధాలను ప్రతిబింబించే ఫోక్ పాటలు యువతను కూడా ఆకర్షిస్తున్నాయి.కొత్త తరానికి అనుగుణంగా ఆధునిక సంగీతాన్ని జోడిస్తూ రూపొందిస్తున్న ఫోక్ సాంగ్స్ భారీ వ్యూస్ సాధిస్తున్నాయి.ఫోక్ సంగీతం ద్వారా ఎంతో మంది స్థానిక కళాకారులు గుర్తింపు పొందడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి.తెలంగాణ సంస్కృతి, భాష,సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఫోక్ సాంగ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**సంస్కృతి ప్రతిబింబమే ఫోక్ సాంగ్స్...**

"మన సంస్కృతికి ప్రతిబింబమే ఫోక్ సాంగ్.. దాన్ని ఆదరించడం అంటే మన మూలాలను గౌరవించడం." తెలంగాణ ప్రాంత ప్రజల జీవనశైలి ,వారి అధిరోహించే సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూనే, ప్రపంచ దేశాలకు మన తెలంగాణ ఖ్యాతిని తెలియపరచిన చరిత్ర తెలంగాణ ఫోక్ సాంగ్స్ ఉంది.ఒక్కొక పాటలో ఒక్కొక విధంగా చిత్రీకరించి ప్రపంచానికి మన తెలంగాణను చూపించే విధానం మరువలేనివి.ఎందరో కళాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ తెలంగాణ కీర్తిని విశిష్టతను చూపుతున్నారు.

**బోనాల జోష్‌కు ఫోక్ సాంగ్స్ ఊపు...**

తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటుతున్న జానపద గీతాలు.బోనాల పండుగ వచ్చిందంటే ఆలయాల సందడితో పాటు ఫోక్ సాంగ్స్ సందడి కూడా మొదలవుతుంది.మహంకాళి అమ్మవారి మహిమ,తెలంగాణ సంప్రదాయాలు,పల్లె సంస్కృతిని ప్రతిబింబించే జానపద గీతాలు భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపుతున్నాయి.యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో బోనాల ఫోక్ సాంగ్స్ లక్షలాది వ్యూస్ సాధిస్తూ ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి.సంప్రదాయ డప్పు, డోలు,టీన్‌మార్ బీట్‌లతో రూపొందిన పాటలు యువతను కూడా విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ఫోక్ సాంగ్స్ ద్వారా తెలంగాణ సంస్కృతి, బోనాల పండుగ విశిష్టత దేశ విదేశాలకు చేరుతోంది. స్థానిక గాయకులు, రచయితలు, కళాకారులకు మంచి గుర్తింపు లభించడంతో పాటు జానపద కళకు కొత్త ఊపు వస్తోంది.

**ట్రెండ్ సెట్ చేసిన....బండి ఫోక్స్ సాంగ్స్..**

"బోనాల పండుగకు ఫోక్ సాంగ్ ఒక ప్రత్యేక ఆకర్షణ.. భక్తి, సంస్కృతి, సంప్రదాయాల కలయికే తెలంగాణ జానపద గీతాలు..! తెలంగాణలో ఫోక్ సాంగ్స్ లో తనదైన ముద్ర వేసి, యువత చూపంతా తనవైపు తిప్పుకున్న బండి ఫోక్స్ సాంగ్స్ నేడు రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొంది,ఫోక్ సాంగ్స్‌లో తనదైన శైలిలో పేరును సంపాదించాడు.బండి ఫోక్స్ పేరుతో యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫారం లో ట్రెండ్ సెట్ చేస్తూ, విశేష ఆదరణతో ముందుకు సాగుతున్నారు. అంతకు ముందు వీరి చానల్ నుండి విడుదలైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సాంగ్స్ కానీ, ఇరుముడి నెత్తిమీద ఇలాంటి దైవభక్తి పాటలను విడుదల చేసి ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. ఇవే కాకుండా నిందల లోకం వంటి అద్భుతమైన ఇన్స్పిరేషన్ సాంగ్ ప్రతి ఒక్కరికీ మనసును తట్టిలేపింది. జూను జూను, పాడురాత శివయ్య, పాలరాతి బొమ్మవే, మా అయ్యవ్వ మెచ్చిన అందగాడు వంటి సాంగ్స్ ఆకట్టుకుంటున్నాయి. పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేస్తూ మధురమైన జ్ఞాపకాలు కలిగించే పాఠశాల సాంగ్ అయిన మరువలేను లే, చదువులమ్మ ఒడిని విడిచి ఉండలేనులే... మధుర జ్ఞాపకాల బడిని అంటూ సాగే ఆ పాట అందరినీ ఆకట్టుకుంది.ఇక బోనాలు పండుగ ఎల్లమ్మ బోనల పాట అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫాం లో ట్రెండింగ్ ఉంటూ, విస్తృతంగా ప్రచారం సాగుతోంది. బండి ఫోక్స్ సాంగ్స్ పేరుతో యూట్యూబ్ ఇన్స్టాగ్రామ్ తెలంగాణ ప్రాంత జీవన విధానాన్ని, ముఖ్యంగా మన ఆచార సంప్రదాయాలను, మన పండుగలను ప్రపంచానికి చూపించాయి. రానున్న రోజుల్లో బండి ఫోక్స్ సాంగ్స్ మరింత ముందుకు సాగి,అశేష ప్రజానీకానికి చేరువై,తనదైన శైలిలో మార్క్ చూపిస్తూ ముందు వరుసలో ఉండాలని బండి ఫోక్స్ సాంగ్స్ ఫాలోవర్స్ తోపాటు వారి అభిమానులు కోరుకుంటున్నారు.ఏది ఏమైనా 'ఫోక్స్ సాంగ్స్ లో... 'బండి ఫోక్స్ సాంగ్స్ వేరయా'...!



బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీమంత్రి తన్నీరు హరీష్ రావును ఆదివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ పుష్పగుచ్చం అందించి, మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, నియోజకవర్గ అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. పంటలకు సాగునీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నా.. పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలను అడుగడుగునా ప్రశ్నించాలని తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని.. బీఆర్ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని తెలపాలని కోరారు.

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా

# ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన

- బాల వికాస ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు
- ఉచిత మందుల పంపిణీ

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**




బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో, లుమినీస్ హాస్పిటల్, హనుమకొండ వారి సహకారంతో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధర్మారపు మహేందర్ మాట్లాడుతూ.. మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ప్రస్తుతం అనేక మంది మహిళలు గైనకాలజీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, అలాంటి వారు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు. అలాగే సీజనల్ వ్యాధులతో పాటు గైనకాలజీ సంబంధిత సమస్యలకు కూడా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరం నిర్వహణకు సహకరించిన బాలవికాస సేవా సంస్థ, లుమినీస్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందానికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో మొత్తం 150 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా, వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.మరింత చికిత్స అవసరమైన రోగులకు హాస్పిటల్‌లో చికిత్సపై 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ ఆరోగ్య శిబిరంలో లుమినీస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ తేజస్విని,డాక్టర్ సంకీర్తన, సిబ్బంది కృష్ణవేణి,భారతి, భిక్షపతి,సంపత్ రెడ్డి,రాజేష్,బాలవికాస సేవా సంస్థ మెయిన్ కోఆర్డినేటర్లు ఎం. రమా,ఎం. సరిత,వార్డు సభ్యులు లావణ్య,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల భరద్వాజ గౌడ్

- నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు
- క్షేత్రస్థాయిలో బిజెపిని మరింత పటిష్టం చేసేలా కృషి చేస్తా
- పెరుమాండ్ల భరద్వాజ గౌడ్

**సైదాపూర్ తెలంగాణ చౌరస్తా:**



భారతీయ జనతా పార్టీ సైదాపూర్ మండల ప్రధాన కార్యదర్శిగా సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన పెరుమాండ్ల భరద్వాజ గౌడ్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం భరద్వాజ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరద్వాజ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ అభ్యున్నతికి తాను చేస్తున్న కృషిని గుర్తించి బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ, క్షేత్రస్థాయిలో బిజెపిని మరింత పటిష్టం చేసేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు, పార్టీ పెద్దలకు జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలకు భరద్వాజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బిజెవైఎం మండల అధ్యక్షుడిగా వొడ్నాల రఘువరన్

**సైదాపూర్ తెలంగాణ చౌరస్తా:**



భారతీయ జనతా యువ మోర్చా సైదాపూర్ మండల అధ్యక్షుడిగా సైదాపూర్ మండలం ఏక్లాస్ పూర్ గ్రామానికి చెందిన వొడ్నాల రఘువరన్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం రఘువరన్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘువరన్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ అభ్యున్నతికి తాను చేస్తున్న కృషిని గుర్తించి బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ, క్షేత్రస్థాయిలో బిజెపిని మరింత పటిష్టం చేసేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు, పార్టీ పెద్దలకు జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలకు భరద్వాజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రమ్య

**సైదాపూర్ తెలంగాణ చౌరస్తా:**



భారతీయ జనతా మహిళ మోర్చా సైదాపూర్ మండల అధ్యక్షులుగా సైదాపూర్ మండలం వెనికెపల్లి గ్రామానికి చెందిన తూటి రమ్య ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం రమ్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ అభ్యున్నతికి తాను చేస్తున్న కృషిని గుర్తించి బీజేపి మహిళా మోర్చా మండల అధ్యక్షులుగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ, క్షేత్రస్థాయిలో బిజెపిని మరింత పటిష్టం చేసేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు, పార్టీ పెద్దలకు జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలకు భరద్వాజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రజల ఆరోగ్యమే నిజమైన సంపద

- మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

ప్రజల ఆరోగ్యమే నిజమైన సంపద మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ అన్నారు. తొర్రూరు పట్టణ 10వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో న్యూ లైఫ్ లైన్ హాస్పిటల్ వారు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. సమయానుకూలంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న న్యూ లైఫ్ లైన్ హాస్పిటల్ యాజమాన్యం అభినందనీయమైన సేవలు అందిస్తోంది" అని పేర్కొన్నారు. శిబిరంలో డా. సురేష్ (ఎం.డి., జనరల్ ఫిజీషియన్) మరియు షుగర్ వ్యాధి నిపుణుల ఆధ్వర్యంలో అన్ని రకాల సాధారణ ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించారు. అలాగే ప్రజలకు ఉచిత రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచిత మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రజలందరూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు,హాస్పిటల్ సిబ్బంది,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# ఉద్యోగాలపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు

- చిలుక మధుసూదన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**



గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదని, ఉద్యోగాలపై మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి విమర్శించారు.తెలంగాణ ఉద్యమకారులను, నిరుద్యోగులను పక్కనబెట్టి పదేళ్లపాటు కల్వకుంట్ల కుటుంబమే పదవులు అనుభవించిందని మండిపడ్డారు.బీఆర్ఎస్ హయాంలో జరిగిన పేపర్ లీకేజీల వ్యవహారాన్ని తెలంగాణ సమాజం ఇంకా మర్చిపోలేదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఆర్టీసీ, విద్యుత్,సింగరేణి వంటి పలు శాఖల్లో పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ చేపడుతూ యువతకు భరోసా కల్పిస్తోందని తెలిపారు.గతంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేటీఆర్ ఇప్పుడు మేక తోలు కప్పిన తోడేలులా మాయమాటలతో ప్రజలను యువతను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సోనియా గాంధీ రాహుల్ గాంధీలను తిడితే హీరోలు కాలేరని హితవు పలికారు. ఇప్పటికైనా నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకుని గత ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు.



# నాగోల్ రమణంద కాలనీలో స్వచ్ఛందంగా 16 సీసీటీవీ కెమెరాల ఆవిష్కరణ

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మీ సురక్ష కమ్యూనిటీ పోలీసింగ్ చేపట్టిన నేను సైతం 2.0 కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రమణంద కాలనీ నివాసులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న 16 సీసీటీవీ కెమెరాలను నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ తో పాటు ప్రజల భద్రతకు సీసీటీవీ కెమెరాలు మూడో కన్నులా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి కాలనీ,వ్యాపార సంస్థల్లో వీటిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరస్తులను త్వరగా పట్టుకోవచ్చన్నారు.ప్రజల భాగస్వామ్యంతోనే పోలీసింగ్ వ్యవస్థ సమర్థవంతంగా సాగుతుందని పేర్కొంటూ ఆయన కాలనీ వాసులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సెక్టర్ ఎస్సై బి.ఉమ,కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.ఎస్.ఆర్.ఎ.ప్రసాద్, డి.ఎస్.ఆర్.మూర్తి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# మీట్ మార్కెట్‌ను ఏర్పాటు చెయాలి

- సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హనుమంతు

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా:**




రామన్నపేట పట్టణంలో కబేళా లేకపోవడంతో మేకలు, గొర్రెలను ఇళ్ల ముందు, వీధుల్లోనే వధ చేయడం వల్ల వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కబేళాను వెంటనే పునరుద్ధరించి, ప్రత్యేక మాంసం మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో బాబుచారి అధ్యక్షతన జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హనుమంతు,పట్టణకార్యదర్శి మునుకుట్ల లెనిన్ మాట్లాడుతూ,ఒకే చోట మేకలు, గొర్రెల వధ నిర్వహించి, గ్రామపంచాయతీ ముద్రతో పరిశుభ్రమైన మాంసాన్ని విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ప్రజారోగ్యం పరిరక్షణతో పాటు పరిశుభ్రత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.



# కేక్ లు కోసి.. స్వీట్లు పంచి..

- ఘనంగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష జన్మదిన వేడుకలు
- బర్త్ డే సందర్భంగా రక్తదానం చేసిన పలువురు నాయకులు, అభిమానులు
- అయ్యా సీఎం రేవంత్.. 'ఇదిగో మా రక్తం ఇస్తున్నాం.. రైతులకు నీళ్లివ్వు'
- కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి పంటలకు నీళ్లు పారించు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**



బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష జన్మదిన వేడుకలను ఆదివారం నియోజకవర్గవ్యాప్తంగా కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు నాయకులు, అభిమానులు రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి దాసరి ఉషకు పుష్పగుచ్చాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు, బీసీ నాయకులు, అభిమానులతో కలిసి ఉష జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అనంతరం దాసరి ఉష మాట్లాడుతూ.. జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు, అభిమానులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. తన జన్మదిన వేడుకల్లో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఉష తీవ్రంగా మండిపడ్డారు. రైతుల పొలాలకు నీళ్లడిగితే.. బీఆర్ఎస్ నాయకుల రక్తాన్ని పంటలకు చల్లాలనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పంటలకు కావాల్సింది రక్తం కాదని, సాగునీరని స్పష్టం చేశారు. 'అయ్యా సీఎం రేవంత్.. మీరడిగినట్టు నా బర్త్ డే సందర్భంగా ఇదిగో మా రక్తం ఇస్తున్నాం.. పంటలకు నీళ్లు ఇవ్వండి' అంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రారంభించి, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల ద్వారా చెరువులను నింపి పంట పొలాలకు సాగునీరు అందించాలని సూచించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు ఉన్నారు.

**బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉష జన్మదిన వేడుకలు..**

బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో దాసరి ఉష జన్మదిన వేడుకలను పట్టణంలోని స్థానిక జెండా చౌరస్తాలో నిర్వహించిన వేడుకలకు బీసీ నాయకులు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కేకును కట్ చేసి..స్వీట్లు పంచిపెట్టి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దాసరి ఉష ఆయురారోగ్యాలతో బాగుండాలని, రానున్న రోజుల్లో ఉన్నతమైన పదవులను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, బీసీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ సిరవేణి స్వప్న, మీడియా ఇంచార్జ్ అబ్దుల్ మాలిక్, బీసీ నాయకులు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

# నేడు మురుగునీరు శుద్ధిచేసే ప్లాంటును ప్రారంభం

- రామన్నపేట మండలాధ్యక్షులు పున్న జగన్మోహన్

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా :**

రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం రోజున IICT వారు నిర్మించిన మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంటును ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం చేతుల మీదుగా ఉదయం 8:30ని:లకు ప్రారంభోత్సవ కార్యక్రమం చేయబడుతుంది. కావున సిరిపురం గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు అలాగే రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు అందరు సరైన సమయానికి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా రామన్నపేట మండలాధ్యక్షులు పున్న జగన్మోహన్ ప్రకటనలో కోరారు






# జిల్లా ఆటో జేఏసీ నూతన కమిటీ నియామకం

- సంఘం బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**

పెద్దపల్లి జిల్లా ఆటో జేఏసీ నూతన అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో రాష్ట్ర స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని, ఆటో కార్మికుల సమస్యలు, సంఘం బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం జిల్లా జేఏసీని మరింత పటిష్టం చేయాలనే ఉద్దేశంతో నూతన అడహాక్ కమిటీని ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా ఎనగందుల నాంపల్లి, జిల్లా కోకన్వీనర్‌గా ఎస్కే జబ్బర్, రామగుండం నియోజకవర్గ కన్వీనర్‌గా ఎండి గౌస్, రామగుండం నియోజకవర్గ కోకన్వీనర్‌గా మడిపెద్ద రమేష్, మంథని నియోజకవర్గ కన్వీనర్‌గా మట్ట నరసయ్య, పెద్దపల్లి నియోజకవర్గ కన్వీనర్‌గా యాదగిరి శంకర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా ఇంచార్జి జనగామ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐబి చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగూడాల సాయిలు, కరీంనగర్ జిల్లా ఇంచార్జి మద్దేల రాజేందర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కట్ట రామ్‌కుమార్, నాయకులు నాగేశ్వరరావు, కాసిపేట రాజయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

- అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన మహిళలు
- తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం బోనాల పండుగ
- అశ్వారావుపేట మండలంలో ఆధ్యాత్మిక శోభ!
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు..
- గుర్రాలచెరువు బోనాల ఊరేగింపులో పాల్గొన్న కాసాని నాగ శేషా పద్మ, ఉదయ జ్యోతి
- భక్తిశ్రద్ధలతో కనకదుర్గ అమ్మవారికి బోనాల సమర్పణ.
- మంగళవాయిద్యాలతో మార్మోగిన వీధులు
- ఊరువాడా ఒకటైన వేళ.. గుర్రాలచెరువు స్వయంభూ కనకదుర్గాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు







# గుర్రాలచెరువులో వైభవంగా ఆషాడ బోనాలు..

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాడ మాస బోనాల వేడుకలు అశ్వారావుపేట మండల పరిధిలోని గుర్రాలచెరువు గ్రామంలో శ్రీ స్వయంభూ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరిగాయి. ఆషాడ మాసంలో గ్రామ దేవతలను పూజిస్తే ప్రకృతి ప్రకోపాలు, కరవు కాటకాలు, అంటువ్యాధులు దరిచేరవని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల దృఢ నమ్మకం. ఈ నేపథ్యంలో ఉదయం నుంచే గుర్రాలచెరువు గ్రామంలో పండుగ వాతావరణం, ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.గ్రామంలోని మహిళలు తెల్లవారుజామునే లేచి ఇళ్లను శుభ్రం చేసుకొని, సాంప్రదాయ దుస్తులు ధరించి, అత్యంత నిష్టతో బోనాలను తయారుచేశారు. కొత్త కుండలకు పసుపు, కుంకుమలు రాసి, వేపాకులతో ఘటాలను అందంగా అలంకరించారు. బియ్యం, బెల్లం, పాలు, నెయ్యితో వండిన పరమాన్నాన్ని (బోనాన్ని) కుండల్లో ఉంచి, దానిపై జ్యోతిని వెలిగించి భక్తిశ్రద్ధలతో తలపైకెత్తుకున్నారు.బోలో బోనాలమ్మా బోల్" అంటూ భక్తుల నినాదాలు, శివసత్తుల పూనకాలు, డోలు సన్నాయి వాయిద్యాల హోరు పోతురాజుల వీరంగ నృత్యాల నడుమ గ్రామ వీధుల్లో బోనాల ఊరేగింపు కనులపండువగా సాగింది. స్థానిక మహిళలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గుర్రాలచెరువు వీధులన్నీ జనసందోహంగా మారాయి. ఈ వేడుకల్లో అశ్వారావుపేట బిఆర్ఎస్ (బిఆర్ఎస్ ) పార్టీ ప్రముఖ కీలక నాయకురాలు కాసాని నాగ శేషా పద్మ, కౌన్సిలర్ డా. భూక్యా ఉదయ జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు స్వయంగా సాంప్రదాయబద్ధంగా బోనాలను తలపైకెత్తుకొని భక్తులతో కలిసి ఊరేగింపులో నడిచి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం శ్రీ స్వయంభూ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కాసాని నాగ శేషా పద్మ, కౌన్సిలర్ డా. భూక్యా ఉదయ జ్యోతి మాట్లాడుతూ.. బోనాల పండుగ అనేది తెలంగాణ ప్రజల జీవన విధానానికి, భక్తిభావానికి ప్రతీక అని కొనియాడారు. ప్రకృతిని, గ్రామ దేవతలను పూజించే గొప్ప సంస్కృతి మనదని, ఈ ఆషాడ బోనాల సాక్షిగా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలందరికీ, మండల ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విరాజిల్లాలని, రైతాంగం బాగుండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి మహానైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



---



# కాంగ్రెస్, బీజేపీలవి ఒట్టి గొప్పలే

- సింగరేణిని ముంచుతున్న గెలిచిన యూనియన్లు
- 17 నెలల్లో ఒక్క బోర్డూ లేదు.. సింగరేణి కార్మికులను దుఃఖసాగరంలో నెట్టారు
- టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ
- మెడికల్ బోర్డుల పేరుతో కార్మికులకు దగా.. 'తాడిచర్ల' క్రెడిట్ కాంగ్రెస్, బీజేపీలది కాదు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :** సింగరేణిలో గెలిచిన యూనియన్ల వైఫల్యాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత వల్ల కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.

**కార్మికులను దుఃఖసాగరంలో నెట్టిన మెడికల్ బోర్డులు!**

గతంలో తాము మెడికల్ బోర్డులు పెట్టించామంటూ ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ యూనియన్లు చంకలు గుద్దుకున్నాయని, కానీ నేడు కార్మికుల పొట్టగొడుతున్నాయని కాపు కృష్ణ విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏడాదికి రెండు మెడికల్ బోర్డులు సజావుగా సాగేవని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే మూడు బోర్డులు నిర్వహిస్తామని నమ్మబలికిన కూటమి, గత 17 నెలలుగా ఒక్క బోర్డు కూడా సరిగ్గా నిర్వహించకుండా మొక్కుబడిగా ముగించిందని మండిపడ్డారు. గతంలో మెడికల్ బోర్డుకు 200 నుండి 250 మందిని పిలిస్తే 80% నుండి 90% మంది అన్‌ఫిట్ (అనారోగ్య కారణాల వల్ల విరమణ) అయ్యేవారని, కానీ ఈ 17 నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జరిగిన బోర్డులో కేవలం 20% మందిని మాత్రమే అన్‌ఫిట్ చేయడం దారుణమన్నారు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ, గెలిచిన యూనియన్ల వైఫల్యమేనని, కార్మికులకు ఏమాత్రం లాభం చేకూర్చని యూనియన్లు మనకెందుకని ప్రశ్నించారు. మైనింగ్ స్టాఫ్‌కు, టెక్నీషియన్లకు సూటబుల్ జాబ్స్ ఇప్పిస్తామని అడ్డగోలు ప్రగల్భాలు పలికిన ఏఐటీయూసీ.. ఈ బోర్డులో 'ఫిట్ ఫర్ జనరల్ అసిస్టెంట్' అని ఇచ్చి కార్మికులను రోడ్డున పడేస్తుంటే ఏం చేస్తోందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**తాడిచర్ల బ్లాక్ మీ ఘనత ఎలా అవుతుంది?**

సింగరేణికి తాడిచర్ల 2 బ్లాక్ లీజు ఇవ్వడం తమ ఘనతేనని కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటోందని కాపు కృష్ణ ఎద్దేవా చేశారు. కనీసం సింగరేణి సీఎండీ ఫోటో కూడా లేకుండా సొంత డబ్బా కొట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అటు 2013 నుండి ప్రాసెస్‌లో ఉన్న విషయాన్ని తామే ఇచ్చామంటూ బీజేపీ ప్రభుత్వం కూడా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిజంగానే సింగరేణిపై చిత్తశుద్ధి ఉంటే.. నామినేటెడ్ పద్ధతిలో కోయగూడెం ఓసి3, సత్తుపల్లి ఓసి3, మణుగూరు డిప్ సైడ్ బ్లాక్, శ్రావణపల్లితో పాటు ప్రస్తుతం వేలంలో పెట్టిన 17 బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించి తమ నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

**ఘనంగా జరిగిన సమావేశం**

ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పూసల వీరభద్రం, కార్పొరేట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య, సంయుక్త కార్యదర్శి వశికర్ల కిరణ్, సెంట్రల్ కమిటీ మెంబర్ కాగితం విజయ్ కుమార్ తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# భగవాన్ హతీరామ్ బావాజీ 597వ జయంతి ఉత్సవాలు

- లంబాడీ గిరిజన సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా భోగ్ భండారో కార్యక్రమం



**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో,తెలంగాణ చౌరస్తా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర సమీపంలోని చుంచుపల్లి మండలం, నందాతండా గ్రామపంచాయతీ పరిధిలోని బృందావనం గుట్టపై వెలిసిన సుమారు 175 ఏళ్ల పురాతన హతీరాం బావాజీ ఆలయంలో జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. లంబాడీ గిరిజన సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి సెక్రెటరీ జనరల్ బానోత్ రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ భోగ్ బండారో కార్యక్రమానికి సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, కార్పొరేటర్ డాక్టర్ బి.ఎస్. రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామితోనే పాచికలు ఆడి గెలిచిన మహోన్నత చరిత్ర భగవాన్ హతీరామ్ బావాజీకి ఉందని కొనియాడారు. స్వామివారే స్వయంగా ప్రత్యక్షమై తన ప్రియ భక్తుడితో పాచికలు ఆడేవారని, ఈ విషయాన్ని నమ్మలేక రాజు గది నిండా చెరకు గడలు ఉంచి హతీరామ్ బావాజీని పరీక్షించగా, రాత్రికి రాత్రి ఏనుగు రూపంలో వచ్చి వాటిని తిన్నట్లు పురాణ ప్రశస్తి ఉందని గుర్తుచేశారు. ఇంతటి మహిమ గల హతీరామ్ బావాజీ ఆలయాన్ని 175 సంవత్సరాల క్రితమే ధారావత్ మంచ నాయక్ ఇక్కడ నిర్మించడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. ఈ చారిత్రక ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 7 ఎకరాల భూమిని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.సంత్ సాధువుల సమక్షంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ భోగ్ భండారు పూజా కార్యక్రమంలో సంయుక్త కార్యాచరణ సమితి వైస్ చైర్మన్ లావుడ్య ప్రసాద్ నాయక్, అధికార ప్రతినిధి వీరన్న నాయక్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ధరావత్ లక్ష్మణ్ నాయక్, డాక్టర్ రవి నాయక్, జగదాంబ సేన వ్యవస్థాపక అధ్యక్షులు రాములు నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు శంకర్ సాధు, బాలు సాధు, గురు సాధు, బదియా సాధు, రమేష్ సాధు, చంద్రకళ శివశక్తి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేష్, రాంజీ, శంకర్, మోహన్ నాయక్, ప్రసాద్ నాయక్, సక్రూ, హీరాలాల్, రాంబాబు, రాజు నాయక్, లంబాడి సాధువులు, కుల సంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి లంబాడీ ప్రజాప్రతినిధులు, ఉద్యోగ ఉపాధ్యాయులు తరలివచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

---

# అశ్వారావుపేటలో అక్రమ ఇసుక ట్రాక్టర్ల సీజ్

- ఇద్దరిపై కేసు నమోదు



**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:** అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లామండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అశ్వారావుపేట పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం మధ్యాహ్నం సమయంలో నారాయణపురం ఖమ్మంపాడు వాగు ప్రాంతం నుండి అశ్వారావుపేట పట్టణానికి కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు.విశ్వసనీయ సమాచారం అందుకున్న అశ్వారావుపేట ఎస్సై యయాతి రాజు తన సిబ్బందితో కలిసి అశ్వారావుపేట శివారు ప్రాంతంలో నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఇసుకతో వస్తున్న రెండు ట్రాక్టర్లను అడ్డుకుని తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు.అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బోడ రవి కుమార్, తాండ్రరాము అనే ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై యయాతి రాజు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

---

## తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

# చావల పురుషోత్తమరావు ఏకగ్రీవ ఎన్నిక

- లక్ష్మీదేవిపల్లి మండలం, కారుకొండ రామవరం గ్రామానికి దక్కిన అరుదైన గౌరవం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం గ్రామ ఉపసర్పంచ్ చావల పురుషోత్తమరావుకు రాష్ట్ర స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఫోరం రాష్ట్ర స్థాయి పదాధికారుల సమావేశంలో పురుషోత్తమరావు సేవలను, ఆయనకున్న నాయకత్వ లక్షణాలను గుర్తించి, కమిటీ సభ్యులందరి సమక్షంలో ఆయనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చావల పురుషోత్తమరావు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం పెద్దలకు, తోటి ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఉపసర్పంచ్‌ల హక్కుల సాధన కోసం, గ్రామ పంచాయతీల బలోపేతం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు, ఉపసర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. కారుకొండ రామవరం వంటి గ్రామీణ ప్రాంతానికి చెందిన ఉపసర్పంచ్ రాష్ట్ర స్థాయి పదవికి ఎంపిక కావడం పట్ల లక్ష్మీదేవిపల్లి మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కారుకొండ రామవరం గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పురుషోత్తమరావుకు పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

---



# ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించాలి

- రెండు తరాల ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనం
- రేవంత్ రెడ్డిపై ప్రేమ యుద్ధం
- ఓయూ జేఏసీ పిడమర్తి రవి.

**తెలంగాణ చౌరస్తా,సికింద్రాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని అదేవిధంగా ఉద్యమకారులకు పింఛన్ గుర్తింపు కార్డు ఇవ్వాలని ఆదివారం,ఓయూలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు పిడమర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించిన పిడమర్తి రవి తెలంగాణ ఉద్యమకారులకు గుర్తించి ప్రభుత్వం కేకే కమిటీ వేయడానికి స్వాగతిస్తూ 250 గజం స్థలం వెంటనే కేటాయించాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్ వేదికగా ఓయూ జేఏసీ నాయకులతో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించుకున్నారు. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమంలో పాల్గొన్నటువంటి ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసుకొని ఉద్యమ కార్యచరణ ప్రకటించబోతున్నామని పిడమర్తి రవి అన్నారు.ఈ కార్యక్రమంలో రాస వెంకటే, సాంబశివ గౌడ్, ఎండి రహీం.వేల్పుల కుమార్, మదిలేటి మధు,దాత్రిక స్వప్న, రేష్మ, శంకర్ నాయక్, ఎండల ప్రదీప్,బైరు నాగరాజ్ గౌడ్, శ్రీశైలం గౌడ్, సంపత్ నాయక్, గద్దల అంజిబాబు, హిందోల్ రాథోడ్. తాండూరు శీను, సంజయ్ గౌడ్, అందే కృష్ణ, జాన్ దర్శన్, తోము నవీన్ యాదవ్, కత్తి సైదులు, స్పోర్ట్స్ ప్రవీణ్, అల్లుడు జగన్,తెలంగాణ సంపత్. బ్రహ్మం, బోరెల్లి సురేష్ నాచ శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్, సుందర్, ప్రసాద్, తీగల శ్యామ్, శ్రీశైలం శ్రీకాంత్ మహేష్ పాల్గొన్నారు.

---




## సిపిఎస్,యుపిఎస్‌లను రద్దుచేసి

# ఓపీఎస్ అమలు చేయాలి

- టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** సిపిఎస్,యుపిఎస్ లను రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేయాలని సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సిపీఎస్ఈయు రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ నాయకత్వంలో కొనసాగుతున్న జనజాగరణ యాత్ర నారాయణపేట జిల్లాకు చేరిన సందర్భంగా టిపిటిఎఫ్ మద్దతుగా పాల్గొని ప్రసంగించడం జరిగింది.ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి 2004 న యూపీఏ గవర్నమెంట్ సిపిఎస్ ను అమలు చేసినప్పుడు దూరదృష్టి గల టిపిటిఎఫ్ ఇది ప్రపంచ బ్యాంకు షరతులకు అనుగుణంగా ఉద్యోగ వర్గానికి నష్టం కలిగించే విధంగా ఉందని చెప్పినప్పటికీ,దాని ప్రభావాన్ని అత్యధిక ఉద్యోగ వర్గం గుర్తించలేదని దాని ప్రభావం గత దశాబ్ద కాలంగా కళ్ళ ముందు రిటైర్డ్ అయిన సిపిఎస్ ఉద్యోగుల ఆక్రందనరూపంలో కనిపిస్తున్నదన్నారు.ఢిల్లీ కేంద్రంగా జరిగిన సిపిఎస్ ఉద్యోగుల నిరసన కారణంగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ యుపిఎస్ ను అమలు చేస్తున్నదని అది కూడా సిపిఎస్ కన్నా అంతా మెరుగైన విధానం కాదన్నారు.సిపిఎస్ మరియు యుపిఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి వాటి స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఓపిఎస్ అమలు కోసం జరిగే పోరాటాలకు ఉద్యమాలకు టిపిటిఎఫ్ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ బాధ్యులు గజలప్ప, వెంకటప్ప,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

---




# జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల సదస్సులో వారు మాట్లాడుతూ, కార్మిక హక్కులను బలహీనపరచడం, రైతు సమస్యలను నిర్లక్ష్యం చేయడం, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం వంటి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే జైలు భరోలో కార్మికులు, రైతులు, కూలీలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు, సహాయ కార్యదర్శి నకిరకంటి రాము, జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నెబోయిన విజయభాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మేడి ముకుంద్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, గీత కార్మిక సంఘం, ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఇల్లందు నియోజకవర్గంలో రూ. కోట్లాది అభివృద్ధి పనులు

- శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- కొమరం కనకయ్య,మాలోత్ రాందాస్ నాయక్





**ఇల్లందు, భద్రాద్రి బ్యూరో,తెలంగాణ చౌరస్తా :**

ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని కామేపల్లి, టేకులపల్లి, ఇల్లందు మండలాల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలు అభివృద్ధి పనులకు ఘనంగా శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు.స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్యతో కలిసి ఆయన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టేకులపల్లి మండలంలోని ముత్యాలపాడు కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రజల ఘన స్వాగతం మధ్య ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే అడవి మద్దులపల్లి గ్రామంలో రూ. 2.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మరో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం రూ. 3.95 కోట్ల వ్యయంతో తాళ్లగూడెం నుండి నరసయ్యకుంట వరకు పాతశాల మీదుగా నిర్మించే నూతన తారు రహదారి పనులకు, రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో ఇల్లందు భవనాలురహదారుల శాఖ మార్గం నుండి కామేపల్లి శ్మశాన వాటిక వరకు పెద్దచెరువు తారు రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఇల్లందు మండలంలోని రొంపేడు గ్రామ పంచాయతీలోనూ మరో నూతన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు, సురక్షితమైన నూతన రహదారులు, వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ నూతన విద్యుత్ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో టేకులపల్లి, కామేపల్లి, ఇల్లందు గ్రామీణ ప్రాంతాలలో నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుతుందని చెప్పారు. దీనివల్ల వ్యవసాయ రంగం, గృహ వినియోగదారులు, చిన్న పరిశ్రమలు గణనీయంగా లబ్ధి పొందనున్నాయని పేర్కొన్నారు.ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని, ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక సదుపాయాన్ని ప్రభుత్వం ద్వారా అందించేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విద్యుత్ కేంద్రాల ద్వారా ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించి, మండలాల అభివృద్ధికి ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బానోతు రాంబాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్ మహేష్, పట్టణ అధ్యక్షుడు బొల్ల సూర్యం, మున్సిపల్ మాజీ అధ్యక్షులు యదలపల్లి అనసూయ, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పూర్వ మండల అధ్యక్షుడు పులి సైదులు, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, వివిధ గ్రామాల సర్పంచులు పాయం స్వాతి ఆంజనేయులు, పాయం లలిత భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోండి

- ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి



**మద్దూర్, తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా,మద్దూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం ఉన్నత విద్యాశాఖ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది.ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ₹400 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.మద్దూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎ,బి.కామ్,బిఎస్సీ కోర్సుల్లో పరిమిత సంఖ్యలో మాత్రమే సీట్లు మిగిలి ఉన్నాయని,ప్రవేశాలు పొందదలిచిన విద్యార్థులు ఆలస్యం చేయకుండా నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.కళాశాలలో నాణ్యమైన విద్య,అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన,డిజిటల్ బోధనా సౌకర్యాలు,పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన విద్యా వాతావరణం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఇప్పటివరకు డిగ్రీలో ప్రవేశం పొందని ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి కోరారు.




# గ్రూప్స్ విజేతలకు సత్కారం

**తెలంగాణ చౌరస్తా, సికింద్రాబాద్:**

ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ సెమినార్ హాల్లో ఆదివారం యుపిఎస్సి, గ్రూప్ వన్ లో ప్రతిభ చాటిన 40 మంది బంజారా సమాజంలోని మేధావులందరికీ తెలంగాణ గోర్ సిక్వాడి, గోర్ సేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విజేతల కృషిని పట్టుదల విజయాలు నేటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకం,అదర్శనీయం అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గోర్ సిక్వాడి బంజారా మేధావులు అతిథులుగా విచ్చేసిన ఎంబిబిఎస్ డాక్టర్లు, కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు రిటైర్డ్ ప్రభుత్వ ప్రొఫెసర్లు UPSC మరియు గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించిన యువతి యువకులను ఉద్దేశించి నేటి తరం విద్యార్థులను ప్రస్తుతం ఉద్యోగ పోటీ ప్రపంచంలో ఎలా ప్రిపరేషన్ కావాలి, భవిష్యత్తు ప్రణాళిక గురించి వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రూప్ 1 లో విజయం సాధించిన ఉద్యోగస్తులు మాట్లాడుతూ బంజారా జాతిలో పుట్టినందుకు గర్వపడుతున్నాము.బంజారా సమాజానికి మావంతు సహాయ సహకారాలు అందిస్తూ బంజారా ఆధ్యాత్మిక ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ సద్గురు సేవలాల్ మహారాజ్ కలలను నిజం చేసి నాయక్ కాశీనాథ్ చూపిన మార్గంలో నడిచి బంజారా జాతి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ బంజారా సమాజాన్ని జాగృతి చేస్తామని పలువురు పేర్కొన్నారు. గోర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు జగన్,ఉపాధ్యక్షులు సేవా లాల్ జాదవ్, మీడియా వింగ్ కన్వీనర్ భాస్కర్ ,రాజు,బిచ్చు నాయక్, పనింద్ర,రవీందర్ రాక్ ఆర్టిస్ట్ డా.వెంకన్న నాయక్ తో పాటుగా ఓయూ పీహెచ్డీ, పీజీ , విద్యార్థులు పాల్గొన్నారు.



# కార్మికుల సంక్షేమానికి అండగా బీఆర్ఎస్

- ప్రతీ కార్మికుడు తప్పనిసరి లేబర్ కార్డు కలిగి ఉండాలి
- అంకం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మొదటి విడతలో...
- సుమారు 500 మందికి లేబర్ కార్డులు అందజేయడం అభినందనీయం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,
- కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి

**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:**

హనుమకొండ లోని జూలైవాడలో బీఆర్ఎస్ యువ నాయకులు అంకం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన కార్మికులకు లేబర్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ....బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో తెలంగాణలో కార్మికుల సంక్షేమానికి అనేక సంక్షేమ చర్యలు అమలు చేశామని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును మరింత బలోపేతం చేసి, నమోదైన కార్మికులకు ప్రమాద బీమా,ప్రసూతి సహాయం,పిల్లల విద్యా సహాయం, వివాహ సహాయం,అంత్యక్రియల ఆర్థిక సహాయం వంటి పలు సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు.సమాజ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని,వారి స్వేద బిందువుల తోనే రాష్ట్ర పునర్నిర్మాణం జరిగిందన్నారు.కార్మికుల సంక్షేమం కోసం పరితపిస్తూ ఇంత ఆదర్శవంతమైన, అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు.లక్ష్మణ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు అడుగడునా అండగా నిలుస్తున్న జూలైవాడ పెద్దలకు,మేధావులకు అందరికి శుభాభినందనలు తెలిపారు.కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన బీఆర్ఎస్ యువ నాయకులు అంకం లక్ష్మణ్ సేవాభావాన్ని ప్రత్యేకంగా అభినందించారు.ఇలాంటి సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న జూలైవాడ పెద్దలు, మేధావులు,యువత,స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు."ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న" అనే స్ఫూర్తితో ప్రజలకు సేవ చేస్తున్న యువ నాయకులను బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని, అంకం లక్ష్మణ్ వంటి సేవాభావం కలిగిన నాయకులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, నాయకులు కాలనీ పెద్దలు తాళ్లపల్లి రామస్వామి,ఆరూరి విష్ణు,అయినవోలు సర్పంచ్ రఘు వంశీ,గునిగంటి చందర్, కంది యాదగిరి,పురుషోత్తం యాదవ్,బలవంతుల అశోక, మురళి,సంభరాజు,శివరాత్రి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.







# 'ఆల్ఫోర్స్' ఎక్సెల్ క్యాంపస్ 'నయా దౌర్' వేడుకలు

- హాజరై ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత...
- డా.వి నరేందర్ రెడ్డి
- సమాజంలో విద్యార్థులు ఉత్తమ స్థానాన్ని కైవసం చేసుకోవాలని పిలుపు



**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

విద్యార్థుల లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని తల్లి దండ్రుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని, సమాజంలో ఉత్తమ స్థానాన్ని కైవసం చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు.స్థానిక కొత్తపల్లి లోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో అల్ఫోర్స్ ఎక్సెల్ (బాలుర రెసిడెన్షియల్ కళాశాల) క్యాంపస్ "నయా దౌర్" పేరుతో నిర్వహించినటువంటి ఫ్రెషెస్ పార్టీ వేడుకలను అట్టహాసంగా విద్యార్థుల కేరింతల మధ్య ప్రారంభించారు.ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టువంటి సరస్వతి మాత విగ్రహానికి పూజను ఆచరించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే కాకుండా వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభను చాటి అవకాశాలను మెరుగుపరచుకోవాలని సూచించారు.నేడు మన భారత దేశంలో ఎంతోమంది విద్యార్థులు వారి యొక్క అసమాన ప్రతిభతో అమూల్యమైనటువంటి అవకాశాలను సొంతం చేసుకొని పటిష్ఠమైన స్థానాలలో స్థిరపడుతున్నారని గుర్తు చేస్తూ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సైతం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన విద్యానందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.ఆరంభం నాటి నుండి విద్యార్థులకు ప్రతిభ ఆధారిత విద్యను అందిస్తూ అగ్రగామిగా ఉంటున్నామన్నారు.2025 2026 విద్యా సంవత్సరంలో వివిధ పరీక్షల ఫలితాల్లో అల్ఫోర్స్ అగ్రస్థానంలో నిలిచినదని హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు కష్టపడి తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను సమీక్షించుకొని వివిధ స్థాయిలలో నిర్వహిస్తున్నటువంటి పరీక్షల్లో ప్రతిభను చాటి అగ్రగామిగా ఉండాలన్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేసాయి.202526 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు.విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక నృత్యాలు అలరింపచేసాయి.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రమాదకరంగా వంగిన 'కరెంట్ పోల్'

- గత ఆరు నెలలుగా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు
- వంగిన పోల్ మార్చాలని రైతుల డిమాండ్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని నుంచి కాల్వ శ్రీరాంపూర్ నుంచి పోత్కపల్లి వెళ్లే దారిలో కెనాల్ కాల్వ వద్ద 11 కే విద్యుత్ సరఫరా జరుగుతున్న విద్యుత్ స్తంభం దాదాపు ఆరు నెలల నుంచి రోడ్డు విస్తరణలో భాగంగా వంగి ఉంది.అటువైపు నిత్యం ప్రజలు ప్రజాప్రతినిధులు వెళుతూనే ఉంటున్నా కనీసం అటువైపు చూస్తున్న నాదుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు విస్తరణలో భాగంగా ప్రమాదకరంగా వంగిన విద్యుత్ పోల్ ను రోడ్డు కాంట్రాక్టర్ మారుస్తారా? లేక విద్యుత్ అధికారులు మారుస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యుత్ శాఖ అధికారులు,ఆర్ అండ్ బి రోడ్డు అధికారులు,రోడ్ కాంట్రాక్టర్ స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ పోల్ మార్చి విద్యుత్ ప్రమాదాన్ని నివారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# చీకట్లో నుంచి వెలుగులోకి..

- 'తెలంగాణ చౌరస్తా' ఎఫెక్ట్ తో... రంగంలోని యంత్రాంగం
- అంధకారంలో మూల మలుపు రోడ్డు...
- అను శీర్షికతో కథనం... స్పందించిన అధికారులు,ప్రజా ప్రతినిధులు
- ఎట్టకేలకు హెడ్ మాక్ లైట్స్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేసిన ప్రయాణికులు
- 'తెలంగాణ చౌరస్తా' కు ప్రశంసలు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో అంధకారంలో పోలీస్ స్టేషన్ మూల మలుపు రోడ్డు వార్త కథనానికి అధికారులు,ప్రజా ప్రతినిధులు,స్పందించి గ్రామంలో అన్నిచోట్ల హెడ్ మాక్ లైట్స్ ఏర్పాటు చేశారు.హెడ్ మాక్ లైట్స్ ఏర్పాటు చేసిన ప్రజా ప్రతినిధులకు,అధికారులకు మండల కేంద్రంలోని ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు,స్థానికులు మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై నిరంతరం తెలంగాణ చౌరస్తా పత్రిక స్పందిస్తూ,అధికారులకు,నాయకులకు విషయాన్ని చేరుకోవడంలో ముందుంటుందని,అంతేకాక ఆ సమస్య పరిష్కారం రూపం దాల్చే దాకా చివరి వరకు పోరాడడంలో తెలంగాణ చౌరస్తా ఉంటుందని తెలిపారు.ఇట్టి విషయమై ప్రయాణాలు,స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ,పత్రికకు ప్రశంసలు కురిపించారు.



18/07/2026 | Page No: 4
epaper.telanganachowrasta.com
తెలంగాణ చౌరస్తా
అంధకారంలో పోలీస్ స్టేషన్
మూల మలుపు రోడ్డు
- గత వారం రోజులుగా రాత్రి పూట వెలుగని హెడ్ మాక్ లైట్స్
- బల్బులు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో నిత్యం ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తూ ఉంటున్నారు. ప్రధాన కూడలి అయిన పోలీస్ స్టేషన్ వెళ్లే మూల మలుపు వద్ద ఏర్పాటు చేసిన హెడ్ మాక్ లైట్స్ దాదాపు వారం రోజుల నుంచి రాత్రిపూట వెలుగు అందించక అంధకారంలో ఉంటుంది.వివిధ గ్రామంలోని ప్రజలు ఇదే మూల మలుపు రోడ్డు నుండి నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు లైట్ వెలుగు లేక చీకట్లోనే వేచి ఉంటూ ప్రయాణిస్తున్నారు.ప్రయాణికులు,ప్రజల భద్రత నిమిత్తం ఇప్పటికైనా సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు,వర్కులు తీసుకొని హెడ్ మాక్ లైట్స్ ఏర్పాటు చేయాలని మండల కేంద్రంలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# నేతకాని హక్కుల పోరాట సమితి ఎన్నిక

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**

నేతకాని హక్కుల పోరాట సమితి మండల కమిటీని ఆదివారం మండల ప్రెస్ క్లబ్లో ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేతకాని హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్కే నేతకాని పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ...భవిష్యత్తులో జరగబోయే నేతకాని హక్కుల సమితి పోరాటంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షులుగా రత్నం రాజన్న, ఉపాధ్యక్షులుగా బోర్లకుంట ప్రణయ్,ప్రధాన కార్యదర్శిగా జాడి రాజయ్య,కార్యదర్శిగా కోట శ్రీనివాస్,రత్నం స్వామి, కోశాధికారిగా దుర్గం భూమయ్య, సంయుక్త కార్యదర్శిగా దుర్గం సంతోష్,బాపు,ప్రచార కార్యదర్శిగా దుర్గం శంకర్, సుధాకర్ తదితరులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దుర్గం రాములు,రాష్ట్ర కోశాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.